సంతోష్ ట్రోఫీకి ఇద్దరు క్రీడాకారులు ఎంపిక

ట్రోఫీకి ఎంపికైన మహేంద్ర, అబ్దుల్

ప్రజాశక్తి-మదనపల్లె : ప్రతిష్టాత్మక సంతోష్ ట్రోఫీకి మదనపల్లి నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ప్రతి ఫుల్‌బాల్ ఆటగాడు ఆశయంగా భావించేది సంతోష్ ట్రోఫీకి రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించడం ప్రతి ఫుట్‌బాల్ క్రీడాకారుడి స్వప్నం. మండలంలోని సిద్ధమ్మగారిపల్లికి చెందిన బి.మల్లయ్య, బి.సరస్వతి దంపతుల కుమారుడు బి.మహేంద్ర, మదనపల్లి మోతినగర్‌కు చెందిన షేక్ మహబూబ్‌బాషా కుమార్ షేక్ అబ్దుల్ ఎంపికైనట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫుల్‌బాల్ అసోసియేషన్ ఈనెల 4 నుంచి 14వ తేదీ వరకు పదిరోజుల పాటు విజయవాడలో క్యాంపు నిర్వహించారు. 17నుంచి 21వ తేదీ వరకు అనంతపురం ఆర్‌డిటిలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీలలో వీరిద్దరూ పాల్గొన్నారు. ఈ ఏడాది ఒకేసారి ఇద్దరు ఎంపిక కావడం సంతోషంగా ఉందని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు దిలీప్‌కుమార్, కార్యదర్శి మురళీధర్ పేర్కొన్నారు. డిఎఫ్ఎ మెంబర్స్ జాన్ కమలేష్, సాగర్, మహేంద్రనాయక్, వెంకటేశ్వర ప్రసాద్, కిరణ్, నరేష్, మోహన్, నరేష్ క్రీడా భారతి సెక్రటరీ, బాలజీ క్రీడాకారులను అభినందించారు.

జీ రామ్ జీ బిల్లును రద్దు చేయాలి

- విబి-జిఆర్ఏఎంజి బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలో నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ, ఉపాధి ఉసురు తీసే మోడీ సర్కార్ నూతనంగా తీసుకొచ్చిన (విబి-జిఆర్ఏఎంజి) చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం స్థానంలో మోడీ సర్కార్ కొత్తగా తీసుకొచ్చిన జీరామ్‌జీ బిల్లును నిరసిస్తూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ దేశ స్వాతంత్య్రోద్యమ కాలపు జాతి నేతల పేర్లను నిస్సిగ్గుగా తొలగించేందుకు వెనకాడటం లేదంటూ మండిపడ్డారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో బిజెపి ప్రభుత్వం మహాత్మునిపై విద్వేషం వెళ్లగక్కుతోందన్నారు. మతోన్మాద ప్రతిబింబించేలా కొత్త చట్టానికి పేర్లు పెడుతున్నారని తెలిపారు. ఇది భారత లౌకిక రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమని, ఈ చర్యను బిజెపి అప్రజాస్వామిక పాలనకు పరాకాష్ఠగా పేర్కొనవచ్చన్నారు. వర్షాభావంతో కరువు కోరల్లో చిక్కుకున్న రైతు కూలీలకు ఉపాధి కల్పించేందుకు చేపట్టిన ఉపాధి హామీ చట్టానికి బిజెపి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందన్నారు. నూతన చట్టం రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం మోపుతోందని, మన రాష్ట్రాలు సుమారు రూ.4 వేల కోట్ల భారాన్ని మోయాల్సి వస్తుందన్నారు. 60 రోజుల పాటు ఉపాధి పనులపై నిషేధం, రాష్ట్రాలపై భారం వేయడంతో ఉపాధి పని రోజులు తగ్గిపోయాయన్నారు. వ్యవసాయ సంక్షోభం పెరిగి మరిన్ని ఆత్మహత్యలకు దారితీస్తుందన్నారు. ఓ వైపు మహాత్మా గాంధీ పేరు తొలగింపు, మరో వైపు రాష్ట్రాలపై అదనపు భారం పడుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నోరు మెదపకపోవడం చూస్తుంటే కేంద్రం వద్ద చేతకాని పిరికిపందల్లా మారారా? అన్నట్లు అనిపిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల ఆగ్రహానికి గురికాకముందే నూతన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోతున్న పేదలకు భూ పంపిణీ చేయడం ద్వారా మాత్రమే వలసలు నివారించగలమని, భూమి లేని పేదలను గుర్తించి వారికి భూ పంపిణీ చేయాలని పేర్కొన్నారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములు గుర్తించి పేదలకు పంచుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరితర్ల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, శేఖర్, నారాయణ, రమణ, పనసమాకులపల్లి, కత్తివారిపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు. **రాజంపేట:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో మహాత్మగాంధీ పేరు తొలగించి విబి-జిఆర్ఏఎంజి పేరు పెట్టడం దారుణమని నిరసిస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం, సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, బిబిఎంయ్య జిల్లా అధ్యక్షుడు మణి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కోట్లాది మందికి ఉపాధి కల్పించే చట్టాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ లాభాల కోసం పని చేయడం సిగ్గుచేటన్నారు. ఒక వైపు పరిశ్రమలు మూసివేసి మరోవైపు వ్యవసాయం దివాళా తెస్తుంటే గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది మేరకు ప్రజల అవసరాలకు తిండికి ఆసరాగా ఉన్న పని లేకుండా చేసి ఆకలి కేకలకు కారణమయ్యే బిజెపికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. పట్టణ ప్రాంతాలకు చట్టాన్ని వర్తింప చేసి 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని తెలిపారు. అనంతరం తహశీల్దార్ పీర్ మున్నీకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, పి.వి.రమణ, కె.ప్రసాద్, ఎం.వి.రమణ, ఏదు కొండలు, సురేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సికిందర్, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

మదనపల్లె : సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

రాజంపేట : తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

మున్సిపల్ అంచనా బడ్జెట్ రూ.228 కోట్లు

- బడ్జెట్ సమావేశంలో చైర్‌పర్సన్ మనూజ

ప్రజాశక్తి-మదనపల్లి

2026-27 ఆర్థిక ఏడాదికి సంబంధించి మదనపల్లె మున్సిపాలిటీ అంచనా బడ్జెట్ రూ.228 కోట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ పేర్కొన్నారు. 2025-26లో సవరించిన బడ్జెట్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, కమిషనర్ ప్రమీల సోమవారం జరిగిన బడ్జెట్ ప్రత్యేక సమావేశం ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. మున్సిపల్ ట్యాక్స్‌లు, అద్దెలు, విఎల్‌డి తదితర రూపాల్లో రూ.58.76 కోట్లు, క్యాపిటల్ పద్దు ప్రభుత్వం నుంచే వివిధ గ్రాంట్ల రూపంలో రూ.61.98 కోట్లతో కలిపి రూ.120.76కోట్లు కాగా ప్రారంభ నిల్వతో వెరసి మొత్తం రూ.228కోట్లుగా చూపించారు. ఇందులో సాధారణ పద్దుల కింద ఖర్చులు రూ.43.38కోట్లు, క్యాపిటల్ పద్దుల కింద ఖర్చులు రూ.77.05 కోట్లతో కలిపి మొత్తం 120.43 కోట్లు పోనూ ముగింపు నిల్వగా రూ.107.59కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో పన్నుల రూపేణా, అద్దెలతో ఆదాయం, ఫీజులు, యూజర్ ఛార్జీలు, అమ్మకం, అద్దెల నుంచి ఆదాయం, వడ్డీలు, ఇతర ఆదాయాలతోకలిపి మొత్తం రూ.58.78 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. మున్సిపాలిటీకి ప్రజల నుంచి వివిధ రూపాల్లో పన్నుల రూపేణా వచ్చే సాధారణ నిధులలో 40శాతం ఆయా వర్గాల అభివృద్ధికి కేటాయింపులు చేపట్టారు. మురికివాడలా అభివృద్ధిలో భాగంగా ఎస్‌సిలకు 17.19శాతం, ఎస్‌టిలకు 5.33శాతం, ఉమెన్, చైల్డ్ వేల్ఫేర్ విభాగానికి 5.33శాతం, వికలాంగులకు 3శాతం చొప్పున అంచనా వేశారు. బడ్జెట్‌లో మొత్తం రూ.6.16 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. నీటి సరఫరాకు 20శాతం నిధులు, మురికినీటి కాలువల నిర్మాణానికి 13శాతం, రోడ్ల నిర్మాణానికి 19శాతం, వీధి దీపాలకు 7శాతం, పార్కుల అభివృద్ధికి 10శాతం,మార్కెట్, పార్కులు, కమ్యూనిటీ హాల్స్, మరుగుదొడ్లు, తదితర విభాగాలకు 17శాతం చొప్పున మొత్తం రూ.15.40 కోట్లు ఖర్చు చేయాలని చూపించారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ

నిజ జీవితంలో గణితం ఒక భాగం : డిఇఒ

రాయచోటి : మాట్లాడుతున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-రాయచోటి

నిజ జీవితంలో గణితం అనేది డబ్బు నిర్వహణ, వంట, ప్రయాణం, ఆరోగ్యం, షాపింగ్ ప్రతి పనిలోనూ ఒక అంతర్భాగంగా ఉందని జిల్లా విద్యా శాఖాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం డైట్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని గణిత అధ్యాపకులు శివభాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొం దించి మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోడానికి సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి గణితం సమాయ పడుతుందన్నారు. అనంతరం వ్యాచరచన, వకృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన చాత్రోపాధ్యాయులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, రామానుజన్ అసోసియేషన్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అధ్యక్షులు రవీంద్రబాబు, డైట్ అధ్యాపకులు కేదార్నాథ్, గిరిబాబుయాదవ్, వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కలికిరి:** జడ్‌పి బాలికోన్నత పాఠశాల, సిద్దార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో భారతీయ మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 138వ జయంతిని పురస్కరించుకుని 'జాతీయ గణిత దినోత్సవం'ను ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో విద్యార్థినులు రామానుజన్ జీవిత చరిత్ర, ఆయన చిన్ననాటి కష్టాలు, స్వయంకృషితో ప్రపంచ ప్రసిద్ధి చెందిన గణిత శాస్త్రవేత్తగా ఎదిగిన తీరు గురించి వివరించారు. గణిత శాస్త్రంలో ఆయన చేసిన అదుతే పరిశోధనలు, సంఖ్యా సిద్ధాంతం, అనంత శ్రేణులు, గణిత నమూనాలు, సూత్రాలపై విద్యార్థి నులు చేసిన ప్రసంగాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఎం.దీప, బి.రజిత, టి.త్రివేణి, బోధన సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ :** మండల కేంద్రమైన కలకడ జడ్‌పి హైస్కూల్(తెలుగు), ఆదర్శ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం నుంచి విద్యార్థులు గణిత పాఠ్యాంశంపై వివిధ రకాలైన చిత్రాలను పదర్శించినట్లు తెలిపారు.గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ గణితంపై చేసిన ప్రయోగాలు, ఆయన జీవితచరిత్రను తెలియజేశారు. అనంతరం గణిత శాస్త్రంలో జరిగిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం అనంతరం నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రూపొందించిన 'కరెంటోళ్ల జనబాట' పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం ప్రధాన ధ్యేయమని తెలిపారు. ప్రజల విద్యుత్ సంబంధించిన సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించేందుకు కరెంటోళ్ల జనబాట కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులు, సిబ్బంది ప్రతి మంగళ, శుక్రవారం నిర్దేశిత గ్రామాలు, పట్టణ వార్డులను సందర్శించి పరిశీల చేపడతారన్నారు. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు సరిచేయడం, వాలిపోతున్న విద్యుత్ స్తంభాల మార్పు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు ఎత్తు పెంచడం చేస్తారని తెలిపారు. పాఠశాలలు, అంగన్వాడీ ప్రాంగాల వద్ద ప్రత్యేక భద్రత చర్యలు, రూపటాప్ సోలార్ ప్లాంట్లకు ప్రోత్సాహం, స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు డయల్ యువల్ సిఎండి కార్యక్రమం, 8.30 నుంచి 9.30 గంటల వరకు డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యుత్ అత్యవసర సమస్యలకు టోల్ ఫ్రీ నెంబర్ 1912 లేదా 1800425155333, వాట్సప్ 913333191 నంబర్లు ఏర్పాటు చేసినట్లు జెసి తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎపిఎస్‌పిడిసిఎల్ అధికాకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల మధ్య రవాణా సౌలభ్యం పెరిగి రైతులు, విద్యార్థులు, ప్రజలకు మేలు చేకూరేలా కూటమి ప్రభుతం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మంత్రిని పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బాధితులకు హామీ ఇచ్చారు.

మంత్రిని కలిసిన అధికారులు : నియోజకవర్గ పరిధిలోని నూతన సిఐలుగా బాధ్యతలు చేపట్టిన పలువురు అధికారులు, సిఐలే మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిశారు. దుశ్యాలవ, పుష్పగుచ్ఛమిచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులకు నియోజకవర్గంలోనే అన్ని మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని తెలిపారు.

నాగిరెడ్డి ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం : రాయచోటి-గాలివీడు రోడ్డు మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి పట్ల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ఉన్న మృతదేహాలను సందర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతి చెందిన వెంకట సాయి కుమార్, రేఉపిన లక్ష్మీప్రసాద్ కుటుంబాలకు మండిపల్లి నాగిరెడ్డి ట్రస్టు ద్వారా చెరో రూ.50 వేల నగదును అందజేశారు. భవిష్యత్తులో పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని వారికి భోరాసానిచ్చారు. ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడడం చాలా బాధాకరమన్నారు. కల్వర్టు నిర్మానం దగ్గర ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు వారి కుటుంబ సభ్యులు ఆరోపించారు. చేతికందిన కుమారులు మృత్యువాత పడడంతో తమకు దిక్కెవరంటూ మంత్రి ఎదుట కన్నీరుమున్నీరయ్యారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాయ ఛాయలు అలుముకున్నాయి.

ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మంత్రిని కలిసిన ఎన్‌జిఒ నేతలు

రాయచోటి అర్బన్: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని జిల్లా ఎన్‌జిఒ సంఘం నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను కడప జిల్లా ఎన్‌జిఒ సంఘ అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, కార్యదర్శి నిత్యపూజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, ఇటీవల నూతనంగా ఎన్నికైన అన్నమయ్య జిల్లా కమిటీ అధ్యక్షుడు వేణు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసన్, కోశాధికారి నాగేశ్వరరావు తదితరులు మంత్రిని కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలంటూ విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌జిఒ కార్యవర్గ సభ్యులు మహదేవ, నరసింహా, గణేష్, ధీరజ్, సిద్దయ్య, హరిప్రసాద్, సందీప్, రాజశేఖర్‌రెడ్డి రాయచోటి తాలూకా కోశాధికారి దేవేంద్ర పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా హరిప్రసాద్, జాబీర్

హరిప్రసాద్

జాబీర్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా హరిప్రసాద్ జాబీర్ ఎన్నికయ్యారు. జిల్లాలోని పీలేరులో ఆదివారం యుటిఎఫ్ నాల్గవ జిల్లా కౌన్సిల్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాకు నూతన కమిటీ ఎన్నుకున్నారు. యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులుగా పి.వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షులుగా హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా షేక్ జాబీర్, సహాధ్యక్షులుగా శివారెడ్డి, సహాధ్యక్షులుగా లక్ష్మీ కళ్యాణి, కోశాధికారిగా ఎస్.దావుద్దీన్ ఎంపికయ్యారు. కార్యదర్శిలుగా శ్రీధర్‌రెడ్డి, ఫణీంద్ర కుమార్ యాదవ్, అశోక్ కుమార్, రమేష్ జోషి, చంద్రశేఖర్‌రెడ్డి, కవితలను ఎన్నుకున్నారు రాష్ట్ర కౌన్సిలర్‌గా చెంగల్‌రాజు, జిల్లా కన్వీనర్‌గా మాధవ మూర్తి, కమిటీ సభ్యులుగా ప్రసాద్, శివ, నారాయణ గౌడ్, చిట్టిబాబులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్ జాబీర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రోజు కోరకమైన అసంబద్ధమైన విధానాలను అమలు చేయడంతో విద్యా ర్థులు ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం దొరకలేదన్నారు. 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించడంతోపాటు 30 శాతం ఐఆర్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. టెట్ నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు.

మదనపల్లె జిల్లా యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

చంద్రశేఖర్

హేమలత

ప్రజాశక్తి-పీలేరు: మదనపల్లి జిల్లా యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని యుటిఎఫ్ రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు జయ చంద్రా రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా 4వ కౌన్సిల్ సమావేశం ఆదివారం పీలేరులో జరిగింది. కౌన్సిల్ సమావేశం అనంతరం మదనపల్లి జిల్లా యుటిఎఫ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు చెప్పారు. యుటిఎఫ్ మదనపల్లి జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎస్.శివారెడ్డి, అధ్యక్షులుగా బి.చంద్రశేఖర్, సహాధ్యక్షులుగా ఎన్.రవి ప్రకాష్, కె.శ్రీలత, ప్రధాన కార్యదర్శిగా కె.హేమలత, కోశాధికారిగా టి.భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శులుగా ఎం.భానుశ్రీ, పి.వెంకటరమణ, కె.ఆది నారాయణ, ఎ.అక్రం బాష, కె.విజయ కుమార్, కె.ఆనందరెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టి.సుధాకర్ నాయుడు, ఆడిట్ కమిటీ సభ్యులుగా శివశంకర్, ఎస్.వేణుగోపాల్, ఎస్.అప్రోజ్, రాష్ట్ర కౌన్సిలర్‌గా వి.సురేందర్‌రెడ్డి, మోడల్ స్కూల్ జిల్లా కన్వీనర్‌గా ఎస్.సాధిక్ అలి, కో-కన్వీనర్లుగా అమృత ప్రియదర్శిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బి.చంద్రశేఖర్, కె.హేమలత మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేస్తామన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

పిజిఆర్ఎస్ అర్జీలకు అధికారులు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. స్థానిక పిజిఆర్ఎస్ హాలులో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలను సమస్యలన్నింటిని నిర్ణీత గడువుగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ మసూదన్‌రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్,సర్వే ఎడి భరత్ కుమార్, ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులను సమస్యలు అడిగితెలుసుకుంటున్న జెసి ఆదర్శ్ రాజేంద్రన్

దేవతామూర్తుల వేషదారణల్లో ఆందోళనకారులు

వినూత్నరీతిలో జిల్లా కేంద్రం ఆందోళనలు

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లాను ప్రకటించాలని కోరుతూ ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి ఆధ్వర్యంలో ఎజెఎసి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 17వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం భవన నిర్మాణ కార్మికులు వినూత్న రీతిలో ఆందోళనలు చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి, వినాయకుడు, శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల వేషధారణతో వినూత్నంగా నిరసనలు తెలుపుతూ ఎజెఎసి దీక్షలకు సంఘీభావం తెలిపి అనంతరం ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద నుంచి పాత బస్టాండ్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో శ్రీనివాసుడిపై 32 వేల సంకీర్తనలు రచిస్తే తనకే అన్యాయం చేసి తాను పుట్టి, పెరిగిన ప్రాంతాన్ని కాదని, తన పేరును మరొక ప్రాంతానికి జిల్లా కేంద్రంగా నామకరణం చేయడం ఏమిటని ప్రశ్నిస్తూ అన్నమాచార్య వేషధారణతో శ్రీనివాసుడికి మొరపెట్టుకున్న నాటకీయ కోణం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి దీక్ష శిబిరం వద్దకు చేరుకొని మర్రి రవి, ఆందోళనకారులకు సంఘీభావం తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పోరాడి రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లాను సాధించుకుందామని పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జెఎసి, కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆదేశాల మేరకు టిడిపి మండల అధ్యక్షుడు మేడికొండ రవికుమార్ నాయుడు ఆధ్వర్యంలో 13వ రోజు రిలేనిరాహార దీక్షల్లో ఆకేపాడు, శేషమాంబపురం, పులపత్తూరు గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో పాలకులు రాజంపేట ప్రజలను దగా చేశారని, దుర్మార్గంగా, అన్యాయంగా రాజంపేటను జ్లిల్లా కేంద్రం చేయకుండా కుట్రబుద్ధితోవ్యవహరించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వంలో నాయకులను మెప్పించి, ఒప్పించి రాజంపేట ప్రజల ఆకాంక్షను నెరవేర్చుకుంటామని తెలిపారు. మంగళవారం జరిగే బంద్‌కు స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ సహకరించి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు అబ్బూరి ప్రభాకర్ నాయుడు, పూల భాస్కర్, డాక్టర్ నవీన్‌చంద్ర, సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణం ప్రధాన కూడలిలో వీరనారి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా రజక సంఘం నాయకులు సోమవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటిన ఐలమ్మ గౌరవార్థం జిల్లా కేంద్రంలో విగ్రహం ఏర్పాటు చేయడం మన బాధ్యతని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక కులానికి సంబంధించిన విషయం కాదని ఒక పోరాట యోధురాలికి మనమిచ్చే గౌరవమని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్న సురేంద్రరెడ్డి

20 గ్యాస్ కనెక్షన్లు మంజూరు

ప్రజాశక్తి-రామాపురం

ఉజ్వల యోజన పథకం కింద 20 గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. మండలంలోని నీలకంఠరావుపేటలో సోమవారం టిడిపి మండల శాఖ అధ్యక్షుడు సరేంద్రరెడ్డి పియంయువైఎ కిందపంపిణీ చేసినట్లు నీలకంరావుపేట సర్పంచ్ మహమ్మద్‌బాషా పేర్కొన్నారు. సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఏ ఒక్క మహిళ కట్టెల పొగతో బాదపకూడదనే ఉద్దేశంతో పిఎం ఉజ్వల యోజన పథకం ద్వారా అర్హులైన ప్రతి మహిళ ఇంటికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్ సిఎం చంద్రబాబు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు అందిస్తున్నారని తెలపారు.

రైతులకు చెక్కును అందిస్తున్న సర్పంచ్

పంట నష్టపరిహారం చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

2018 నుంచి పెండింగ్‌లో ఉన్న 20 మంది మామిడి రైతులకు గ్రామ సర్పంచ్ మునీర్‌బాషా ఆధ్వర్యంలో రూ.2లక్షలు విలువ చేసే చెక్కును అందించారు. మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీలో 2018లో గ్రామీణ ఉపాధి హామీ ద్వారా మంజూరైన పంట నష్ట పరిహారం 20 మంది రైతులకు పెండింగ్‌లో ఉంది. గత వైసిపి ప్రభుత్వంలో మంజూరు కాకపోవడంతో పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం మంజూరు చేయడంతో సర్పంచ్ బాధిత రైతులకు అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అన్నయ్య, కదిరప్పనాయుడు, డిజిటల్ అసిస్టెంట్ మదన్, వెల్ఫేర్ అసిస్టెంట్ రవితేజ, ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనాన్ని వడిస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

విద్యార్థులకు అతిథి భోజనం

ప్రజాశక్తి-నందలూరు

విద్యార్థులకు అతిథి భోజనాన్ని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సోమవారం అరవపల్లి క్రీడామోదానంలో మండల ప్రాథమిక పాఠశాలలో ఆయన తల్లిదండ్రులు జ్ఞాపకార్థం విద్యార్థులకు అతిథి భోజనాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి నాణ్యమైన బిర్యానీ, చికెన్, అరటిపండ్లు, సీట్లు అందించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వర లక్ష్మీ, వెంకటరమణ, రవీంద్రబాబు, సూర్యనారాయణ బాలాజీ పాల్గొన్నారు.

యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఆర్కేవ్యాలీ విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయి ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్, ఫుట్‌బాల్, హకీ టోర్నమెంట్‌కు ఇడుపులపాయి ఆర్కేవ్యాలీ విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా తెలిపారు. ఇంటర్ క్యాంపస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం డైరెక్టర్, ఎఒ పెనుకొండ రవికుమార్ అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమార స్వామి గుప్తా మాట్లాడుతూ ఇంటర్ యూని వర్సిటీ టోర్నమెంట్ క్రీడా పోటీల్లో అన్ని విభాగాల్లోని క్రీడాల్లో ఇడుపుల పాయి ట్రిపుల్‌ఐటి విద్యార్థులు ప్రతిభ చూపారని తెలిపారు. ఆర్జీయూకేటీ యూనివర్సిటీ తరుపున జనవరిలో కేరళ రాష్ట్రంలో జరిగే కేరళ యూని వర్సిటీ, ఆంధ్ర యూనివర్సిటీ, సత్యభామ యూనివర్సిటీల్లో జరిగే క్రీడాల్లో తమ కళాశాల విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఇంటర్ యూని వర్సిటీలో జరిగే క్రీడాల్లో విద్యార్థులు ప్రతిభ చూపి ఆర్కేవ్యాలీ క్యాంపస్ పేరును నిలబెట్టాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులను అభినందించిన వారిలో వ్యాయామ విద్యా విభాగానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్లు పి.వి.రమణారెడ్డి, బాల ఓబయ్య, షంషాద్ బేగం పాల్గొన్నారు.

కిసాన్‌ధన్ ఆరోగ్య యోజన రైతులకు మేలు

ప్రజాశక్తి-రాజంపేట

రైతులకు కిసాన్‌ధన్ ఆరోగ్య యోజన బీమా పథకం వరమని, ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పివిఆర్ గ్రూప్ ఆర్గనైజషన్స్ రాయలసీమ కో-ఆర్డినేటర్ మల్లిఖార్జున తెలిపారు. పివిఆర్ గ్రూప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని మిట్టమీద పల్లి, మదన గోపాలపురం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిసాన్ ధన ఆరోగ్య యోజన ప్రయోజన పథకం రైతుల కోసం ప్రత్యేక బీబా పథకమని వివరించారు. ఈ పథకం ద్వారా రైతులు సభ్యత్వం తీసుకోవడం వల్ల రైతుల సహాయం కోసం రూ.25 వేలు వరకు, పంట నష్టపరిహారం రూ.50 వేలు వరకు అందుతుందన్నారు. రైతుకు ఏదైనా ప్రమాదం జరిగితే రూ.3 లక్షల వరకు ప్రమాద బీమాతో పాటు పిటిడి, పిపిడి అందజేయబడతాయన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాల కోసం మండల కో-ఆర్డినేటర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య, నెల్లూరు జిల్లాల ఇన్‌ఛార్జి ఎన్.వెంకటేశ్వర్లు, రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నాగేంద్రప్రసాద్, కోఆర్డినేటర్లు జి.మానస, సి.అక్షయ, సి.చరిత, కే.దిలీప్ కుమార్, ఎన్.గంగాభవాని, సి.రజిని, ఎం.నాగేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు ఇస్తున్న కో-ఆర్డినేటర్లు

వ్యక్తిగత శుభ్రత కోసమే 'ముస్తాబు' : డిఐఒ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ అజంతుల్లా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ రఘురామయ్య ఆధ్వర్యంలో సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత పోటీలేవా ముస్తాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఐఒ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లా పార్వతీపురంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడానికి కారణం పరిశుభ్రత లేకపోవడమేనన్నారు. కారణం గుర్తించిన అక్కడి కలెక్టర్ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ ముస్తాబు పేరుతో పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. విద్యార్థులు మరుగుదొడ్లకి వెళ్లిన తర్వాత, భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్ర పరచుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా గోర్లను కత్తిరించుకోవాలన్నారు. స్నానం, బూట్లు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి విద్యార్థి శుభ్రతను పాటించి ముస్తాబు కావాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్యాంసుందర్, అరుణమ్మ, చంద్రశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, బాస్కర్, చంద్రకళ, రమేష్ రాజు, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఐఒ రవి

మదనపల్లిలో కార్డన్ సెర్చ్

పోలీసుస్టేషన్‌కు 61 వాహనాలు తరలింపు

కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక పట్టణంలో ఎస్‌పి ధీరజ్ కనుబిల్లి ఆదేశాల మేరకు సోమవారం తెల్లవారుజామున డిఎస్‌పి మహేంద్ర పర్యవేక్షణలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించి, సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలోని దక్కేపేట, ఆగ్రజలవీధి, హౌసింగ్‌బోర్డ్, త్యాగరాయవీధి, బడేమకాన్ ప్రాంతాలను వన్‌టౌన్ సిఐ మహమ్మద్ రఫీ, టూటౌన్ సిఐ రాజారెడ్డి, ఎస్ఐల బృంద పట్టినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేని అనుమానాస్పదంగా ఉన్న 61ద్విచక్రవాహనాలను, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చేసేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు చెప్పారు. యువత చెడు మార్గాల్లో వెళ్లకుండా, అక్రమ కార్యకలాపాలకు పాల్పడకుండా నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. అపరిచిత వ్యక్తులు, అనుమానిత వస్తువులు కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు చూపితే వాహనాలను తిరిగి ఇస్తామన్నారు.

బాధితులకు న్యాయం చేయండి : బిఎస్‌పి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రంగంపల్లి పంచాయతీ అరుంధతి వాడకు చెందిన దళితుల అసైన్డ్ భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని వాటిని తిరిగి బాధితులకు అప్పగించాలని రైల్వేకోడూరు బిఎస్‌పి ఇన్‌చార్జి తాళ్లపాక సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు సోమవారం తహశీల్దార్ పుల్లారెడ్డికి వినతిపత్రం అందించినట్లు లేబాక మస్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగంపల్లి అరుంధతివాడకు చెందిన 30మంది పేద ప్రజల అసైన్డ్ భూముల కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని తెలిపారు. వాటిని తిరిగి బాధితులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి అసైన్డ్ భూములను తిరిగి దళితులకు అందించాలన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు అధ్యక్షులు లేబాక మస్తాన్, మండల అధ్యక్షులు తాళ్లపాక నరసింహులు, చిట్టిబాబు, సిద్దయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బిఎస్‌పి నాయకులు

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత : పీడీ

మహిళలకు రక్తపరీక్షలు చేయిస్తున్న పీడీ లక్ష్మీదేవి

ప్రజాశక్తి -రాజంపేట

మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మెప్మా పీడీ లక్ష్మీదేవి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సురక్ష రక్షణ కవచం అన్నారు. ప్రధానంగా మహిళల్లో పెరుగుతున్న రొమ్ము క్యాన్సర్, రక్తహీనత, థైరాయిడ్, మధుమేహం వంటి వ్యాధులను నివారించేందుకు సిఎం చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికే మదనపల్లిలో కూడా మహిళలకు రక్త పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ అనుసంధానంతో రిజిస్ట్రేషన్ చేసి రక్త పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వారి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తామని, నివేదిక రాగానే వారికి సమాచారం అందజేసి ఆరోగ్యంగా ఉండేందుకు వైద్యుల సూచన మేరకు సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. సఖి సురక్ష ద్వారా అన్ని రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డిఆర్ఎల్ మణి, చంద్రమౌళి, సిటీ మిషన్ మేనేజర్లు అయ్యావారయ్య, గోపీనాథ్, నాగరాజు పాల్గొన్నారు.

నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలి

ప్రజాశక్తి-రాయచోటి

పిఎంశ్రీ పాఠశాలల ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయులు నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి కోరారు. పట్టణంలోని డైట్ కళాశాలలో సోమవారం జిల్లాలోని 39 పిఎంశ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎస్ఎన్ఎ స్పర్శ్‌పై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శ్ అనేది కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు పంపే పథకాల నిధులను సకాలంలో, సమర్థవంతంగా బదిలీ చేయడానికి రూపొందించబడిన ఒక వ్యవస్థని చెప్పారు. ఈ విధానం దేశమంతటా అమలులో ఉందని, ఎలాంటి అవకాశం లేకుండా పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా పీఎంశ్రీ పాఠశాలలకు మంజూరు అవుతున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్పర్శ్ జిల్లా నోడల్ అధికారి అసాదుల్లా సిఎఫ్ఎంఎస్ విధానంలో బిల్లులను ఆన్‌లైన్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలి, వెండర్ అకౌంట్ ఎలా సృష్టించాలి, ఈ ప్రక్రియలో పాటించాల్సిన నియమ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీ వేణి, రిసోర్స్‌పర్సన్స్ రమేష్, గోవిందు, పిఎంశ్రీ పాఠశాలల ప్రిన్సిపల్స్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నరసింహారెడ్డి

కాంగ్రెస్‌పై మోడీ వ్యాఖ్యలు హాస్యాస్పదం

ప్రజాశక్తి - వేంపల్లె: కాంగ్రెస్‌పై ప్రధాని వ్యాఖ్యలు హాస్యాస్పదనమి పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశ వ్యతిరేకి అని అనడం శోచనీ యమన్నారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులు అస్సోంలో స్థిరపడేందుకు కాంగ్రెస్ అన్ని విధాలా సాయం చేస్తోందని, రైతులను విస్మరిం చిందని మోడీ పేర్కొనడాన్ని ఆయన తప్పుపట్టారు. భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రసాదించడం దేశ వ్యతిరేకమా అని ప్రశ్నించారు. నవభారత నిర్మాణం, హరిత విప్లవం, పారిశ్రామిక విప్లవం, సమాచార, ఎలక్ట్రానిక్ విప్లవాలు తేవడానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందన్నారు. రైతులకు పలు పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. టిడిపికి బడుగు, బలహీన వర్గాలపై చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ అధ్యక్ష పదవినిగానీ, సిఎం పదవినిగానీ వారికి కేటాయిం చాలన్నారు. కాంగ్రెస్ పార్టీపై పిఎం వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్ర మణ్యం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు పాల్గొన్నారు.

నేడు పులివెందులకు జగన్ రాక

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పులివెం దులకు వస్తున్నట్లు తాడిపల్లి కార్యాలయ వ్యక్తిగత నాగేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో మూడు రోజుల పాటు పులివెందుల నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 23న మధ్యాహ్నం 4 గంటలకు బెంగళూరు నుంచి హెలికాప్టర్ ద్వారా పులివెందులకు చేరుకుంటారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి తన నివాసంలో బస్తా చేస్తారు. 24న ఉదయం రోడ్డు మార్గాన ఇడుపులపాయకు చేరుకుని ప్రార్థన మందిరంలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థన చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు పులివెందులకు చేరుకుని క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. రాత్రి పులివెందులలోని తన నివాసంలో బసచేస్తారు. 25న ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు బాక్రాపురంలోని హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో బెంగుళూరుకు బయలుదేరుతారు.

పేదల ఆరోగ్యానికి అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఆయన 47 మందికి రూ.22.57 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స ఖర్చులు భరించలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో దోహదపడుతుందన్నారు. పేదల ప్రజలకు కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సిఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందేలా ప్రజాప్రతినిధులుగా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబ సభ్యులు రాంగోపాల్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సతీమణి ఉమాదేవి, టిడిపి నాయకులు బొజ్జ మైసూరారెడ్డి, తాళ్ళపల్లి వేంకటేశ్వర రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, ముచ్చుమర్రి పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల ధారాదత్తం దుర్మార్గం

ప్రజాశక్తి-కడప అర్బన్

గుంటూరు జిల్లాలో వక్ఫ్‌బోర్డు భూమిని ముస్లిముల అభ్యున్నతి, అభివృద్ధికి ఉపయోగించకుండా ఏక పక్షంగా రూ.1000 కోట్లు విలువ చేసే స్థలాన్ని ధారాదత్తం చేయడం దుర్మార్గమనిముస్లిమ్ సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సలావుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం గుంటూరు కలెక్టర్ తమిమ్ అన్సారీకి రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గం చినకాకాని గ్రామంలో వక్ఫ్‌భూమిలో పారిశ్రామిక, ఐటి పార్క్ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. 71.57 ఎకరాలు వక్ఫ్‌భూమిలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఈ ఏడాది జనవరి 24న చేసిన ప్రతిపాదనపై ముస్లిమ్ సమైక్య వేదిక తీవ్రంగా వ్యతిరేకిస్తుంని చెప్పారు. ప్రజాప్రయోజనం అనే ముసుగులో రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులను హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విస్తారమైన ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నప్పటికీ వక్ఫ్‌భూమిని లక్ష్యంగా చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భేషరత్తుగా ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సమైక్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

పోలియో చుక్కల మ్యాపింగ్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ శివప్రతాప్

పోలియో చుక్కల మ్యాపింగ్ తనిఖీ

ప్రజాశక్తి-కలికిరి

పల్స్ పోలియో చుక్కల రెండో రోజు కార్యక్రమాన్ని జిల్లా ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ , పిపిఐ జిల్లా పరిశీలకులు డాక్టర్ శివప్రతాప్ పరిశీలించారు. మండలంలోని కలికిరి-2 సచివాలయం పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ప్రాంతాలోని గుడిసెలు, కలికిరి-3 సచివాలయం పరిధిలో గల కె.మాదిగ పల్లి గుట్ట పైగల గుడిసెలలో ఉన్న పోలీయో చుక్కలు వేయించుకోని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేయించారు. ఏ ఒక్క బిడ్డ కూడా పోలియో చుక్కలు వేసుకోకుండా తప్పి పోకూడదని అందుకే మొత్తం మూడు రోజులు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో మేడికుర్తి వైద్యులు డాక్టర్ కావ్యగంధ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఎంఎల్‌హెచ్‌పి నాగవేణి, ఎఎన్‌ఎం నఫీసా, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బోనాసి దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

పట్టణంలోని పీటర్ రాక్‌చర్చిలో సోమవారం గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ బోనాసి జాన్‌బాబు అధ్యక్షతన సెమిక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. పండుగను పురష్కరించుకొని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం బోనాసి దంపతులను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రతి ఒక్కరూ శాంతి, సమాధానంతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలోపాస్టర్ దివాకర్, పోలయ్య, శామ్యుల్, నిర్మల, ప్రమీలు, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

అపర్ణ కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి-మదనపల్లి

భర్త అకాల మృతితో దు:ఖంలో ఉన్న వైసిపి మహిళ టౌన్ అధ్యక్షులు అపర్ణను సోమవారం వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ పరామర్శించారు రెండు రోజుల క్రితం ఆమె భర్త వెంకటరమణ మృతి చెండటం భాధకరమన్నారు. అపర్ణ వైసిపిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అపర్ణను పరామర్శించిన వారిలో కో-ఆప్షన్ మెంబర్ శారదారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

మా గ్రామాన్ని విడగొట్టొద్దు

ప్రజాశక్తి-రాజంపేట

ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉన్న తమను పంచాయతీలుగా విభజన చేసి విడగొట్టవద్దని ఆకేపాడు ప్రజలు ముక్తకంఠంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం డిఎల్‌పిఒ మస్తాన్ వల్లి నేతృత్వంలో, పంచాయతీ కార్యదర్శి కరీముల్లా ఆధ్వర్యంలో ఆకేపాడు గ్రామపంచాయతీని నాలుగు పంచాయతీలుగా విభజించేందుకు గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. పంచాయితీ విభజనకు ససేమిరా అన్న ప్రజలు ఇప్పటి లాగానే కొనసాగాలని అడిగిన వెంటనే ముక్తకంఠంతో అవునంటూ బిగ్గరగా సమాధానం చెబుతూ నినాదాలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ప్రజల నుంచి సంతకాలు స్వీకరించి ఆమోదం

గ్రామసభకు హాజరైన ప్రజలు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం మదనపల్లిలో మండలంలో జరిగింది,. తాలుకా పోలీసుల కథనం మేరకు.. సిటిఎం గ్రామం చిలకలవారిపల్లికి చెందిన చందు, గణేష్ భవన నిర్మాణ కార్మికులు.పోతబోలులో భవన నిర్మాణ పనులు చేసేందుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. పోతబోలు గ్రామ శివారులో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే బాధితులను మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలోచేర్చి చికిత్స అందిస్తున్నారు.

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలో పేకాట స్థావరాలపై దాడిచేసి నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. పరసతోపు పంచాయితీ దాదంవడ్డిపల్లి సమీపంలోని బోడిగుట్ట సమీపంలో పేకాట ఆడుతుండగా సమాచారంతో తన సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకోగా ఐదుగురు పారారయ్యారని తెలపారు. నిందితులపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ.16,790 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, స్వాధీనం చేసుకున్నటుల తెలిపారు. ఋనిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచ నున్నట్లు తెలిపారు. పేకాటస్థావరంపై దాడిలో ఎఎస్ఐ నజీర్‌బాషా, సిబ్బంది శివశంకర్ రెడ్డి, వెంకటేష్, మంజుల పాల్గొన్నారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పీలేరు

చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పీలేరు మండలంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ, మర్రిమాకులపల్లెకు చెందిన బి.ఆనంద(55) తమ అల్లుళ్లు వినోద్, హరి. తమ్ముడు కలిసి సూరప్పచెరువుకు చేపల వేటకు వెళ్లారు. చెరువులో వల వేసి తీసే క్రమంలో నీటి లోపల ఉన్న పాచి చుట్టుకుని అతను నీట మునిగాడు. అతని అల్లుళ్లకు ఈత రాకపోవడంతో వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు చెరువులోంచి ఆనందను వెలికి తీసిన ఫలితం లేకుండా పోయింది. ఆ ఘటనలో ఆనంద్ అప్పటికే మృతి చెందాడని తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్థం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ చెప్పారు.